యూజీసీ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి

- వీసీలు, ప్రొఫెసర్ల నియామక నిబంధనలు సరికాదు
- ఉన్నత విద్య నిర్వీర్యానికి బీజేపీ కుట్రలు: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతులు, సహాయ ఆచార్యుల నియామకాల నిబంధనల మార్పు కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై ఏఐఎస్ఎఫ్ మండిపడింది. ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా ప్రతిపాదనలు ఉన్నాయని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఓ ప్రకటనలో విమర్శించారు. ఆర్ఎస్ఎస్ అనుకూల విధానాలు ప్రవేశపెట్టేందుకే వీసీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల అర్హతలో సడలింపులు ఇచ్చారని ఆరోపించారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా పరిశ్రమ, ప్రభుత్వ రంగాలకు చెందిన నిపుణులను వీసీలుగా నియమించవచ్చని చెప్పడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల సిఫారసు మేరకు గవర్నర్లు వీసీలను నియమిస్తుండగా, కొత్త నిబంధనల ప్రకారం ఆ అధికారాన్ని కేంద్రం తీసుకుంటుందని, తక్షణమే ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఆర్ కృష్ణయ్య డిమాండ్

రవీంద్రభారతి, జనవరి 22: ఏడాదిలోపే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని తుంగలో తొక్కిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను పూర్తి చేసి అవి తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 65 ఏండ్లకు పెంచే ఆలోచనను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశానికి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల్లో వివిధ శాఖల్లో ఏర్పడిన వందలాది ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయసు పెంపుతో ఖాళీ కావాల్సిన 40 వేల ఉద్యోగాలకు గండి పడుతుందని, నిరుద్యోగుల పొట్టకొట్టినట్టు అవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 16లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, రేవంత్ సర్కార్ ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకుండా బడా కాంట్రాక్టర్లకు వేలాది కోట్ల రూపాయలు దోచిపెడుతున్నదని ధ్వజమెత్తారు.

నడిగడ్డలో ఇసుక తరలింపు

- అడ్డుకున్న గ్రామస్తులు
- అవసరానికి మించి నిల్వ చేసుకుంటున్న ఇసుక మాఫియా
- కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయం

నాగర్‌కర్నూల్, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డ సమీపంలోని దుందుభీ నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. అక్కడి చేరుకున్న రెవెన్యూ, మైనింగ్, పోలీసులతో సైతం గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ భవన నిర్మాణాల పేరుతో తమ ప్రాంతం నుంచే ఎక్కువ మొత్తంలో ఇసుకను తరలించడం ఏమిటని ప్రశ్నించారు. అనుమతులు తీసుకున్న తర్వాత అవసరాన్ని బట్టి ఇసుకను తరలించాల్సి ఉండగా, ఇసుక మాఫీయా అక్రమంగా అధిక మొత్తంలో తరలించి నిల్వ చేసుకుంటుందని ఆరోపించారు. కృత్రిమ కొరత సృష్టించి నిల్వ చేసుకున్న చోటునుంచి అధిక ధరలకు ప్రైవేట్‌గా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వ అనుమతులు ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఒకరు అనుమతి తీసుకుంటే బారులుగా ట్రాక్టర్లను తీసుకువచ్చి రాత్రి, పగలు ఇసుకను తోడివేస్తున్నారని మండిపడ్డారు. పంట పొలాలకు నీటి కోసం ప్రాణాలైనా అర్పించి ఇసుక తరలింపును అడ్డుకుంటామని భీష్మించి కూర్చున్నారు. ఓవైపు గ్రామస్తులు ఆందోళన చేస్తుండగా మరో వైపు ఇసుకను ట్రాక్టర్లలో నింపడంతో అధికారుల తీరుపై గ్రామస్తులు మండిపడ్డారు. అధికారులతో ఇసుక మాఫియా కుమ్మక్కై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని అసహనం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తరలింపును నిలిపివేయాలని డిమాండ్‌చేశారు.

దానం.. అప్రధానం

- 'చేతి'లో ఇమడలేక సతమతమవుతున్న ఎమ్మెల్యే
- కనీసం నిరుపేదలకు భరోసా ఇవ్వలేని దుస్థితి
- మొన్న బంజారాహిల్స్.. నేడు చింతల్‌బస్తీ
- నాగేందర్ మాటల్ని ఖాతరు చేయని అధికారులు
- ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే కూల్చివేతల ముగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 22 (నమస్తే తెలంగాణ): పెదవి దాటే మాట.. రంగు మారే కండువా.. వెనక్కి తీసుకోవాలంటే అంత సులువు కాదు! కలిసొస్తే పూలబాటనే... బూమరాంగ్ అయిందో!! కుంపటి మీద కూర్చున్నట్టే.. నిత్యం అంతర్మథనం తప్పదు. మరో మాటలో చెప్పాలంటే.. పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారవుతుంది. ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిస్థితి ఇలాగే ఉన్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంగీ మార్చినంత ఈజీగా పార్టీ కండువా మార్చారు. కానీ హస్తం ఆశించిందొకటి.. దానం కోరుకున్నది మరోటి. పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ సీటు కోసం నాగేందర్‌ను ఒక పావులా వాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావించింది కాబోలు. కలిసొస్తే 'హస్తిన'వాసి.. కాకపోతే ఇక్కడ అధికారదర్పం దక్కుతుందని దానం కూడా ఊహించినట్లున్నరు. అందుకే కండువా మార్చిన కొత్తలో ఆయన ఆవేశపడి మాటలు పేల్చేవారు. ఆ తర్వాత ఎంపీ పదవి దక్కకపోగా.. ఇటు అధికారదర్పం పేరుకే పరిమితమైంది. కనీసం ఒక్క అధికారి కూడా మాట వినకపోవడం ఒకవంతైతే.. సొంత నియోజకవర్గంలోని పార్టీలో రెండు బలమైన వర్గాలు ఆయన పాత్రను నామమాత్రం చేశాయి. ప్రభుత్వంపై అసంతృప్త రాగాలు ఆలపిస్తున్నా అత్యంత ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ కదా! పట్టించుకునే దిక్కే లేకుండాపోయింది. తాజాగా చింతల్‌బస్తీ కూల్చివేతల సందర్భంగా అధికారులెవరూ తన మాట వినకపోవడంతో ఓ పది నిమిషాల పాటు హైడ్రామా చేసి జారుకోవాల్సి వచ్చిందంటూ 'ఎక్స్' కోడై కూస్తున్నది.

మాట వినని అధికారులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ నుంచి గోడ దూకి అధికార పార్టీ కండువా కప్పుకున్న దానం నాగేందర్ గత కొంతకాలంగా తీవ్రంగా సతమతమవుతున్నారని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ పరిధిలోని నందగిరి హిల్స్‌వాసుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా గురుబ్రహ్మనగర్ బస్తీలోని గుడిసెలకు దారి విషయంలో హడావుడి చేసింది. ఆ సందర్భంగా హైడ్రా కమిషనర్ వర్సెస్ దానం నాగేందర్ అన్నట్టు కొద్ది రోజులు హైడ్రామా నడిచింది. కానీ దానం ఆశించినట్టు అధికారపక్షం నుంచి ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో నారాజ్ అయిన దానం నాగేందర్ తాను థర్టీ ఇయర్ ఇన్ పాలిటిక్స్.. ఇలాంటి అధికారులు వస్తుంటారు! పోతుంటారు!! అంటూ గొంతెత్తారు. ముఖ్యంగా హైడ్రాతో పేదల ఇండ్లు కూల్చివేస్తే మన కొంపనే మునుగుతుందంటూ అధికార పార్టీపై అసంతృప్తి గళం వినిపించారు. తాజాగా బుధవారం చింతల్‌బస్తీలో ట్రాఫిక్ పోలీస్-జీహెచ్ఎంసీ సంయుక్తంగా రోప్ కింద రోడ్డు ఆక్రమించి చేపట్టిన వందకుపైగా నిర్మాణాలను కూల్చివేశారు. ఇండ్లు కోల్పోయిన వారంతా రోజువారీగా పొట్టపోసుకునే చిరు వ్యాపారులే. దీంతో అక్కడకు వచ్చిన దానం నాగేందర్ ఒకింత ఆవేశానికి గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే నోటీసులో లేకుండా కూల్చివేతలు ఎలా చేపడతారు? ఆపకపోతే ఇక్కడే బైఠాయిస్తా.. ఎమ్మెల్యే పదవి పోయినా సరే జేసీబీకి అడ్డంగా కూర్చుంటానని హెచ్చరించారు. 'దావోస్‌లో ఉన్న సీఎం వచ్చే వరకు రెండ్రోజులు ఆగండి.. ప్రజలకు నేను కదా సమాధానం చెప్పుకోవాల్సింది... కూల్చివేస్తే బాగుండదు..' అంటూ ఘాటుగా మాట్లాడారు. కానీ ఇదంతా పది నిమిషాల్లో ముగిసింది. అధికారులు మాత్రం క్షణం పాటు కూడా కూల్చివేతలు నిలిపివేయలేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో దానం నాగేందర్ వ్యాఖ్యలు... కొనసాగుతున్న కూల్చివేతలపై నెటిజన్లు సెటైర్లు వేశారు. పార్టీ మారినప్పటికీ దానం మాటలు ఏ ఒక్క అధికారి వినడంలేదంటూ చురకలు అంటించారు. ముఖ్యంగా పది నిమిషాలపాటు హడావుడి చేసిన దానం నాగేందర్ ఆ వంక కన్నెత్తి చూడలేదంటే తన మాట ఎవరూ వినడంలేదనే నిర్వేదంలోకి వెళ్లి, మళ్లీ 'థర్టీ ఇయర్ ఇన్ పాలిటిక్స్' అనే రాగం అందుకోక తప్పలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి...

కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లోనూ దానంది ఇదే పరిస్థితి అని పార్టీవర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఖైరతాబాద్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన విజయారెడ్డి వర్గానికి దానం అంటే పడదు. దీంతో ఎమ్మెల్యే లేకుండానే ఆమె అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి. పైగా విజయారెడ్డి డివిజన్‌లో ప్రారంభోత్సవమైనా, శంకుస్థాపన అయినా ఒకే పనికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడం అందరికీ తెలిసిందే. మరోవైపు మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ వర్గం కూడా ఎమ్మెల్యేకు ఢీటుగా ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తుందని, ఆ వర్గం అంతా పార్టీ సీనియర్ నేత రోహిన్‌రెడ్డి వైపు ఉంటుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇక అధికారుల పోస్టింగ్‌ల్లో ఆయన పరిస్థితి సంక్లిష్టంగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు శాఖకు సంబంధించి ఒక్క పోస్టింగ్‌లో కూడా ఆయన మాట చెల్లుబాటు కాకపోవడంతో పాటు తన అనుచరులపైనే కేసులు నమోదు అవుతుండటం దానం జీర్ణించుకోలేకపోతున్నారని చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన కొన్నిరోజుల కిందట ఒక ఇంటర్వ్యూలో పోలీసు ఉన్నతాధికారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల జీహెచ్ఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలోనే బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు

40 ఏండ్ల ఉపాధి.. నిమిషంలో నేలమట్టం!

ఖైరతాబాద్ చింతల్‌బస్తీలో నిర్మాణాలను జేసీబీతో కూల్చివేస్తున్న సిబ్బంది

- ఖైరతాబాద్ చింతల్‌బస్తీలో 100 షాపుల కూల్చివేత
- వీధి వ్యాపారుల షాపులను ధ్వంసంచేసిన అధికారులు
- స్థానిక ఎమ్మెల్యే అడ్డుపడినా ఖాతరు చేయని యంత్రాంగం

ఖైరతాబాద్/సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్‌లోని చింతల్‌బస్తీలో అక్రమ నిర్మాణాల పేరిట జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వందకుపైగా దుకాణాలను కూల్చివేశారు. సుమారు 145 మంది సిబ్బంది బుధవారం ఉదయం 8 గంటల నుంచి కూల్చివేతలను చేపట్టారు. గత 40 ఏండ్లుగా ఇక్కడే ఉంటూ బతుకుదెరువు సాగిస్తున్న తమ షాపులను తొలగిస్తే రోడ్డునపడుతామంటూ స్థానికులు రోదించినా.. అధికారులు కూల్చివేతలను ఆపలేదు. ఇన్నాళ్లు తమకు ఉపాధినిచ్చిన నిర్మాణాలు కండ్ల ముందే కూలుతుంటే బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. తాము ఏం పాపం చేశామని తమపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష కట్టాడంటూ రోదించారు.

పరీక్ష ఫీజు 520.. ఫైన్ 2,500

- సర్కారు పాపం.. విద్యార్థులకు శాపం
- ఇంటర్ విద్యార్థులపై పెనుభారం
- మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు ఆలస్యంగా అనుమతులు
- ఫలితంగా ఫైన్‌తో ఫీజు కట్టాల్సిన పరిస్థితి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్ష ఫీజేమో రూ. 520. కానీ ఫైన్ మాత్రం రూ. 2,500!. ఈ ఫైన్ చెల్లించాల్సింది ఏ ఒకరో ఇద్దరో కాదు ఏకంగా 35వేల మంది!. ప్రైవేట్ జూనియర్ కాలేజీలు, ఇంటర్‌బోర్డు రెండింటి తప్పిదం ఇప్పుడు విద్యార్థుల పాలిటశాపంగా మారింది. ఈ ఫీజు మొత్తం విలువ రూ. 8.7కోట్లు. అంటే విద్యార్థుల నుంచి ఆ మొత్తాన్ని ఇంటర్ బోర్డు ముక్కుపిండి వసూలు చేయనుంది. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు నడుస్తుండటం, అగ్నిమాపకశాఖ ఫైర్ ఎన్‌వోసీ జారీచేయకపోవడంతో 237 కాలేజీలకు ఇంటర్‌బోర్డు అనుమతి ఇవ్వలేదు. జూన్ నుంచి ఈ కాలేజీలు నడుస్తున్నాయి. డిసెంబర్ దాటి జనవరి సమీపించినా ఆయా కాలేజీల వైపు ఇంటర్ బోర్డు కనీసం కన్నెత్తికూడా చూడలేదు. వాస్తవానికి అనుమతి లేకుండా నడుస్తున్న ఆయా కాలేజీలను సీజ్ చేసి, విద్యార్థులను సమీపంలోని సర్కారు కాలేజీల్లో చేర్పించాల్సి ఉండే. ఇలా కూడా చేయకుండా ప్రైవేట్ కాలేజీలకు అనుకూలంగా వ్యవహరించారు. ఎట్టకేలకు జనవరి 15న ఆయా కాలేజీలకు ఫైర్ ఎన్‌వోసీ నుంచి మినహాయింపు ఇచ్చింది. దీంతో ఆయా కాలేజీలు గుర్తింపు పొందేందుకు వీలు కలిగింది. అయితే ఇప్పటికే ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు ముగిసింది. ప్రస్తుతం రూ. 2,500 ఫైన్‌తో ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించే అవకాశముంది. ఇంటర్‌బోర్డు నుంచి గుర్తింపు లేకుండా కాలేజీలను నడిపిన యాజమాన్యాలు బాగానే ఉన్నాయి. కాలేజీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేని ఇంటర్‌బోర్డు బాగానే ఉంది. కానీ ఈ కాలేజీల్లో చేరిన 35వేల మంది మాత్రం పెనుభారం మోయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆలస్యంగా అనుమతినిచ్చిన ఇంటర్‌బోర్డు కాలేజీల నుంచి సొమ్ముచేసుకునేందుకు ఒక్కో కాలేజీపై రూ. లక్ష జరిమానా విధించి చేతులు దులుపుకుంది.

మళ్లీ కథ మొదటికి..

ఫైర్ ఎన్‌వోసీ నుంచి కాలేజీలకు మినహాయింపునిచ్చినా మళ్లీ కథ మొదటికొచ్చింది. ఇంటర్‌బోర్డు విధించిన రూ. లక్ష ఫైన్‌ను చెల్లించలేమంటూ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు చేతులెత్తేశాయి. దీంతో అనుమతి పొందని కాలేజీల్లోని విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి ఫీజు చెల్లించాలని ఇంటర్‌బోర్డు అధికారులు తాజాగా ఆదేశాలిచ్చారు. దీంతో ఫైర్ ఎన్‌వోసీ నుంచి మినహాయింపునిచ్చినా ఫలితం లేకుండాపోయింది.

అన్ని అంశాలపైన ప్రశ్నలు

జేఈఈ మెయిన్స్ పరీక్షలు షురూ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ఐఐటీలు, ఎన్ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో పరీక్షలు నిర్వహించగా, ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టు.. అన్ని అంశాల నుంచి ప్రశ్నలిచ్చినట్టుగా విద్యార్థులు తెలిపారు. భౌతికశాస్త్రంలో థర్మల్ ఫిజిక్స్, ప్రొజెక్షనల్ మోషన్, ఎలక్ట్రికల్ సర్క్యూట్, డయోడ్, విద్యుదయస్కాంత తరంగాలు వంటి వాటి నుంచి ప్రశ్నలిచ్చారు. లోతైన పరిజ్ఞానం కలవారే ఈ ప్రశ్నలను ఛేదించగలరు. ఇక గణితంలోని ప్రశ్నలకు ఆన్సర్లు రాబట్టేందుకు అధిక సమయం పట్టింది. గణాంకాలు, సంభావ్యత, వెక్టర్స్, త్రీడీ జ్యామితి, నిర్ణాయకాల అంశాలనుంచి ప్రశ్నలిచ్చారు. మొత్తం మూడు విభాగాల్లో కెమిస్ట్రీ సులభంగా ఉండగా, ఫిజిక్స్, గణితం ప్రశ్నలకు కాస్త సమయం పట్టింది. గణితం ప్రశ్నలకు అధిక సమయం పట్టిందని శ్రీచైతన్య ఐఐటీ ఆలిండియా కో-ఆర్డినేటర్ ఎం ఉమాశంకర్ విశ్లేషించారు. గతంలో ఫిజిక్స్, కెమిస్ట్రీలు విద్యార్థులను ఇబ్బందిపెట్టేవని,ఈ రెండు సబ్జెక్టుల్లో ప్రశ్నలు సులభంగానే ఇచ్చినట్టు వెల్లడించారు. 100కు 95 పర్సంటైల్ స్కోర్ సాధించవచ్చని తెలిపారు. గురు, శుక్రవారాలతోపాటు ఈ నెల 28న బీటెక్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనుండగా, ఈ నెల 30న బీఆర్క్, బీప్లానింగ్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు.

స్థలపరిశీలన పేరుతో మళ్లీ భూమిపూజ

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దవాఖానకు భూమి పూజ
- మళ్లీ భూమిపూజ చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర

మక్తల్, జనవరి 22 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా 150 పడకల దవాఖాన నిర్మాణం కోసం గతంలో భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా స్థల పరిశీలన అని చెప్పి బుధవారం వైద్యారోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా మళ్లీ భూమిపూజ నిర్వహించింది. అప్పటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సర్వే నంబర్ 919లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 150 పడకల దవాఖాన నిర్మాణం చేపట్టాలని 2023 అక్టోబర్ 4న అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతులు మీదుగా భూమిపూజ చేశారు. ఏడాది తర్వాత మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గత ప్రభుత్వంలో మంజూరైన దవాఖాన నిర్మాణ పనులకు ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా భూమి పూజ చేయించడం చర్చనీయాంశంగా మారింది.

నాడు

మక్తల్‌లో 150 పడకల దవాఖాన నిర్మాణానికి అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించిన శిలాఫలకం

నేడు

నిర్మాణ పనులను మళ్లీ ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాదీ కంపెనీలతో.. దావోస్‌లో ఒప్పందం

- టీహబ్‌లో పురుడు పోసుకున్న స్కైరూట్‌తో ఎంవోయూ
- రాష్ట్రంలో మేఘా కంపెనీ భారీ పెట్టుబడులంటూ ప్రచారం
- కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ ఏర్పాటు అంటూ గొప్పలు
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ

రేవంత్‌రెడ్డీ.. ఇన్నోవేషన్ ఇదేనా?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): పెట్టుబడులు తీసుకురావడంలో రేవంత్‌రెడ్డి తీరును చూస్తే నవ్వొస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన కంపెనీలతో వేలాది మైళ్ల దూరంలో ఉన్న దావోస్, స్విట్జర్లాండ్‌లో ఎంవోయూలు కుదుర్చుకోవడం సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందని సెటైరికల్ ట్వీట్ చేశారు. తెలంగాణ కంపెనీలైన మేఘా, స్కైరూట్, సీఆర్ఎల్ఎస్‌తో విదేశాల్లో ఒప్పందాలు చేసుకుంటే విదేశీ పెట్టుబడులు తెచ్చినట్టు ఎలా అవుతుందో ఆయనకే అర్థం కావాలని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ):

- 'రాకెట్ల తయారీ సంస్థ స్కైరూట్ రాష్ట్రంలో రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నది'
- 'మేఘా ఇంజినీరింగ్ కంపెనీ రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. మూడు ఒప్పందాలు కుదిరాయి'
- 'రాష్ట్రంలో అత్యాధునిక ఏఐ డాటా సెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డాటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ ఎంవోయూపై సంతకం చేసింది'

దావోస్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం తమ ఘనతగా చెప్పుకుంటున్న పెట్టుబడులు ఇవి. కానీ.. ఈ మూడు కంపెనీలూ హైదరాబాద్‌కు చెందినవే. మన రాష్ట్ర రాజధానిలో కొలువైన కంపెనీలు.. మన రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయన్నమాట. అదీ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో. ఆయా కంపెనీల ప్రధాన కార్యాయాల నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయంలో చేసుకోవాల్సిన ఒప్పందాలు.. ఏడు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దావోస్‌లో ఎందుకు జరిగాయని సోషల్‌మీడియాలో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి స్కైరూట్ కంపెనీ బీఆర్ఎస్ హయాంలో స్థాపించిన టీహబ్‌లో పురుడుపోసుకున్నది. టీవర్క్స్ సాయంతో 2022లోనే సొంతంగా దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్‌ను ఆవిష్కరించింది. తొలి ఇంటిగ్రేటెడ్ రాకెట్ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ ఫెసిలిటీని తెలంగాణలో స్థాపిస్తామని ప్రకటించింది. 2022 నవంబర్ 26న జరిగిన ఈ కార్యక్రమానికి నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. అలాంటి సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నదంటూ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకోవడంపై మండిపడుతున్నారు.

గొప్పలు చెప్పుకునేందుకేనా?

దావోస్ పర్యటనలో భారీగా పెట్టుబడులు సాధిస్తున్నట్టు చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాపత్రయపడుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే.. హైదరాబాద్‌కే చెందిన కంపెనీలతో స్విట్జర్లాండ్‌లో ఎంవోయూలు చేసుకున్నారని విమర్శిస్తున్నారు. వాస్తవానికి డబ్ల్యూఈఎఫ్ వేదికగా తెలంగాణలో ఉన్న అవకాశాలను దేశ, విదేశీ కంపెనీలకు పరిచయం చేసి, చర్చలు జరిపి, పెట్టుబడులు సాధించాల్సి ఉంటుందని చెప్తున్నారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ కంపెనీలను తెలంగాణకు ఆకర్షించేలా ప్రజంటేషన్ ఇవ్వాలని సూచిస్తున్నారు. అలాంటిది హైదరాబాదీ కంపెనీలకు కొత్తగా తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నిస్తున్నారు. ఈ తతంతం మొత్తం ఇక్కడే పూర్తి చేయొచ్చని, కేవలం సొంత ప్రచారం కోసమే డబ్ల్యూఈఎఫ్‌ను వేదికగా చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. మేఘా రూ.15వేల కోట్లు, కంట్రోల్ ఎస్ సంస్థ రూ.10వేల కోట్లు, స్కైరూట్ రూ.500 కోట్లు.. మొత్తంగా మూడు కంపెనీలు కలిపి రూ.25,500 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది.

గాంధీభవన్‌లో బాహాబాహీ

- యూత్ నేతల తన్నులాట
- పొంగులేటి వర్సెస్ భట్టి అనుచరులు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): గాంధీభవన్ సాక్షిగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుచరులు బాహాబాహీకి దిగారు. పదవుల కోసం తన్నుకున్నారు. బుధవారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందంటూ కొత్తగూడెం యూత్ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. పొంగులేటి వర్గానికి చెందిన చీకటి కార్తీక్ తప్పుడు బర్త్ సర్టిఫికెట్‌తో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గెలిచారని భట్టి వర్గం నేతలు ఆరోపించారు. దీనిపై గాంధీభవన్‌లో జరుగుతున్న సమావేశంలో సుధీర్ అనే కార్యకర్త ప్రశ్నించారు. దీంతో ఆయనపై పొంగులేటి వర్గం కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. గాంధీభవన్ లోపలి నుంచి బయటి వరకు ఉరికిస్తూ పిడిగుద్దులు కురిపించారు. దీంతో సుధీర్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి వారిని చెదరగొట్టారు. ఈ ఘటనపై గాంధీభవన్ వర్గాలు స్పందించకపోవడం గమనార్హం.

రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే కాలేజీలు బంద్

- వీసీకి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వినతి

డిచ్‌పల్లి, జనవరి 22 : మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బుధవారం తెలంగాణ యూనివర్సిట